

ప్రియాంకగాంధీ పర్యటన రద్దు

నర్సాపూర్, మే 5: నర్సాపూర్‌లో ఈ నెల 7వ తేదీన ఉదయం నిర్వహించనున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్ జాతీయ నేత ప్రియాంక గాంధీ పర్యటన రద్దయినట్లు మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. అనివార్య కారణాలవల్ల ప్రియాంకగాంధీ పర్యటన రద్దయిందని తెలిపారు. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో, కార్నర్ మీటింగ్ మాత్రం ఖరారయ్యే అవకాశముందని పేర్కొన్నారు. త్వరలోనే కార్యక్రమంపై తుది నిర్ణయం వెలువడుతుందని తెలిపారు.


జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన మెదక్ అంబేడ్కర్ సర్కిల్

నిప్పుల కుంపటి

సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఉమ్మడి మెదక్ జిల్లాకు రెడ్ అలెర్ట్

మెదక్, మే 5 : ఉమ్మడి మెదక్ జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తున్నది. ఎండలు మండిపోతున్నాయి. ఎండ తీవ్రతకు వడగాలులు తోడవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో 45.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదయింది. జిన్నారం పారిశామికవాడలో 45.2 డిగ్రీలు, సిద్దిపేట అర్బన్‌లో 45.2 డిగ్రీలు, రేగోడ్‌లో 45.1 డిగ్రీలు, కల్హేర్ మండలంలో 44.9 డిగ్రీలు, సదాశివపేటలో 44.7 డిగ్రీలు, కుకునూర్‌పల్లిలో 44.8 డిగ్రీలు, హుస్నాబాద్‌లో 44.8 డిగ్రీలు, చేర్యాల్‌లో 44.4 డిగ్రీలు, తొగిటలో 44.3 డిగ్రీలు, సిద్దిపేట రూరల్‌లో 44.1 డిగ్రీలు, మద్దూర్‌లో 44 డిగ్రీలు, హవేళీ ఘనాపూర్‌లో 44.5 డిగ్రీలు, కుల్చారంలో 44.3 డిగ్రీలు, ఝరాసంగంలో 44 డిగ్రీలు, దుల్‌మెట్టలో 43.8 డిగ్రీలు, కొమురవెల్లిలో 43.8 డిగ్రీలు, పాపన్నపేట, నర్సాపూర్‌లలో 43.3 డిగ్రీలు, టేక్మాల్‌లో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఉమ్మడి జిల్లాకు వాతావరణశాఖ రెడ్‌అలెర్ట్ ప్రకటించింది. ఎండల తీవ్రతకు మధ్యాహ్నం 12 గంటలకే జనసంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. పార్టీల ఎన్నికల ప్రచార జోరు కూడా తగ్గింది. సాయంత్రం సమయంలోనే రోడ్డుషోలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

బీజేపీకి ఓటేస్తే మీ బిజినెస్‌లకు నష్టం

- వ్యాపారులపై ఐటీ దాడులు చేయించే సంస్కృతి వారిది
- మంచిచెడు చూసి ఓటెయ్యండి
- సిద్దిపేట ఆర్యవైశ్యులు, వ్యాపారులకు సూచన
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సిద్దిపేట టౌన్, మే 5: వ్యాపారులపై ఐటీ దాడులు చేయించే సంస్కృతి బీజేపీదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి స్పష్టంచేశారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి ఓటేయాలని కోరుతూ స్థానిక ముస్తాబాద్ చౌరస్తా నుంచి బస్టాండ్ మీదుగా గాంధీ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీ, రోడ్‌షోకు జగ్గారెడ్డి హాజరయ్యారు. రోడ్‌షోకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేట వ్యాపారానికి మంచి కేంద్రమని, ఆ తరువాతే సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట అని అభివర్ణించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి కొందరు వైశ్యులు ఓట్లు వేస్తున్నట్లుగా తనకు తెలిసిందని, గాడ్సేకు మద్దతిస్తున్న ఆపార్టీకి మీరు ఓట్లు ఎలా వేస్తారని ప్రశ్నించారు. వైశ్యుడైన గాంధీజీని చంపిన వ్యక్తికి మద్దతిస్తున్న బీజేపీని చూస్తే రక్తం ఉడుకుతలేదా అని ప్రశ్నించారు. మాయ మాటలకు కాకుండా, మంచిచెడును ఆలోచించి ఓటేయాలని ఆర్యవైశ్యులకు సూచించారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలను అర్పించారన్నారు. దేశ అభివృద్ధి కోసం రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సమస్యల కోసం పోరాటం చేస్తామని, అధికారంలోకి వచ్చాక శాసిస్తామే తప్ప, ఎవరిని హింసించమని చెప్పారు. కొంతమంది పోలీసు అధికారులు చెంచాగిరి చేస్తున్నారని, ఇంత హీనమైన బతుకు బతకడం అవసరం లేదని సూచించారు. ఇకపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు జోలికి వస్తే సహించేది లేదన్నారు. పూజల హరికృష్ణ మాట్లాడుతూ సిద్దిపేటలో మదన్‌మోహన్ తరువాత కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కు లేకుండా పోయిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి సిద్దిపేటలో పార్టీ పూర్వ వైభవానికి కృషిచేస్తునట్లు తెలిపారు. తాడూరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలంతా కలిసి కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దరిపల్లి చంద్రం, సూర్యవర్మ, గూడూరి శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, కలీమొద్దిన్, గంప మహేందర్, దేవులపల్లి యాదగిరి, దాస అంజయ్య, మార్క సతీష్‌గౌడ్, ముద్దం లక్ష్మి, రియాజొద్దిన్, సాకి ఆనంద్, బుచ్చిరెడ్డి, పూజల గోపికృష్ణ, మీసం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేటలో నిర్వహించిన రోడ్‌షోలో జగ్గారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


రోడ్‌షోలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు

డైట్ బకాయిలు చెల్లించరా?

- నెలల తరబడి పెండింగ్‌లోనే
- ప్రభుత్వ ఆస్పత్రులకు పేరుకుపోయిన బిల్లులు
- బిల్లులు రాక లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు
- ఆహారం సరఫరా చేయబోమంటూ హెచ్చరిక
- రోగులు, బాలింతలకు ఇబ్బందులు
- ఏప్రిల్ నుంచి జేఎస్‌ఎస్‌కే బడ్జెట్ నిలిపివేత
- తేల్చిచెప్పిన ఉన్నతాధికారులు


సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో భోజనం వడ్డిస్తున్న సిబ్బంది (ఫైల్)

సంగారెడ్డి అర్బన్, మే 5: ప్రభుత్వాస్పత్రులకు డైట్ సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండడంతో బిల్లులు చెల్లిస్తారా.. గర్భిణులు, రోగులకు ఆహారం సరఫరా నిలిపేయమంటారా? అంటూ కాంట్రాక్టర్లు హెచ్చరిస్తున్నారు. డైట్ బకాయిలు చెల్లించని సర్కారు తీరుపై కాంట్రాక్టర్లు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇకపై ఆహారం సరఫరా చేయబోమంటూ అధికారులకు తేల్చి చెబుతున్నారు. ఉన్నఫలంగా రోగులకు అందించాల్సిన ఆహారం నిలిపేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కాంట్రాక్టర్లను బుజ్జగిస్తూ నెట్టుకొస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు వైద్య విధాన పరిషత్ పరిధిలోని పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట నాలుగు ఏరియా ఆస్పత్రులు, కోహీర్, కల్హేర్, కరస్‌గుత్తి, సదాశివపేట, మిర్జాపూర్‌లోని ఐదు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు డైట్ కోసం ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనరల్, జేఎస్ఎస్‌కే నిధులు విడుదల చేస్తూ వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సాహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా నిధులు విడుదల చేస్తున్నది. జననీ శిశు సురక్షా కార్యక్రమం(జేఎస్ఎస్‌కే) పేరిట ప్రసవాలకు వచ్చేవారికి అవసరమైన మందులు, ఆహారం అందజేస్తున్నారు. ఇందులో భాగంగా సాధారణ ప్రసవమయ్యే వారికి ఆహారం కోసం రోజుకు రూ.100 చొప్పున మూడు రోజుల పాటు రూ.300 ఒక్కొక్కరికి ఖర్చు చేస్తున్నారు. అలాగే సీజేరియన్ అయిన వారికి ఆహారం కోసం రోజుకు రూ.100 చొప్పున ఏడు రోజుల పాటు రూ.700 వెచ్చిస్తున్నారు. ఇక సాధారణ రోగులకు రోజుకు రూ.72 చొప్పున ఒక్కొక్కరికి ఖర్చు చేస్తున్నారు. అయితే వీటన్నింటిని సరఫరా చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు.

జేఎస్ఎస్‌కే బడ్జెట్ కట్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవమైన మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ద్వారా జననీ శిశు సురక్షా కార్యక్రమం కింద ఏటా పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తున్నది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1నుంచి జేఎస్ఎస్‌కే కింద డైట్ బడ్జెట్ ఇవ్వడం నిలిపివేస్తున్నట్లు జనవరి 19న వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం మిషన్ డైరెక్టర్ రాష్ట్రంలోని అన్ని సర్కారు ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు లేఖ రాసింది. డీఎంఈ, టీవీవీపీ ఆస్పత్రులకు జేఎస్ఎస్‌కే కింద బడ్జెట్ విడుదల చేయబడదని సూచించగా, ఇక నుంచి ఎలాంటి ప్రతిపాదనలు పంపవద్దని పేర్కొన్నది. జేఎస్ఎస్‌కే నిధుల విడుదలను సర్కారు నిలిపివేయనుండడంతో ఇక నుంచి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే జనరల్ బడ్జెట్ నుంచే బాలింతలకు డైట్ బిల్లులు కూడా చెల్లించే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

పేరుకుపోయిన బకాయిలు

సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డైట్‌కు సంబంధించిన జనరల్, జేఎస్ఎస్‌కే బడ్జెట్ బకాయిలు పేరుకుపోయాయి. జిల్లా కేంద్రమైన ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సంబంధించి 2023 సెప్టెంబరు నుంచి 2024 ఏప్రిల్ వరకు 8 నెలల బిల్లులు రూ.64 లక్షలు జనరల్ బడ్జెట్ కింద చెల్లించాల్సి ఉన్నది. జేఎస్ఎస్‌కే కింద 2022 నవంబరు నుంచి 2024 ఏప్రిల్ (17 నెలలు) వరకు రూ.51 లక్షల బకాయిలు రావాల్సి ఉన్నాయి. టీవీవీపీ పరిధిలోని నాలుగు ఏరియా, ఐదు కమ్యూనిటీ ఆస్పత్రులకు 2023 నవంబరు నుంచి 2024 ఏప్రిల్ వరకు రూ.కోటి 2 లక్షల బకాయిలు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో సర్కారు నుంచి బకాయిలు రావాల్సి ఉండడంతో డైట్ సరఫరా చేసేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. నిత్యం మెనూ ప్రకారం రోగులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నా బకాయిలు సకాలంలో సర్కారు నుంచి విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి డైట్ బకాయిలు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.





ఏడుపాయలలో భక్తుల సందడి

ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. ఎండల తీవ్రతను కూడా లెక్కచేయకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంజీర నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

-పాపన్నపేట



కిక్కిరిసిన మెదక్ సీఎస్ఐ చర్చి

మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. వేసవి సెలవులు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం శిలువ ఆరాధన, అనంతరం బిషప్ పద్మరావు ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

-మెదక్ కల్చరల్

ప్రశాంతంగా నీట్

- సంగారెడ్డిలో తొమ్మిది కేంద్రాల్లో నిర్వహణ
- పరీక్ష రాసిన 3,556 మంది అభ్యర్థులు

సంగారెడ్డి అర్బన్, మే 5 : వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే అర్హత పరీక్ష నీట్ సంగారెడ్డిలో ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాల, సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాల, విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్, సెయింట్ పీటర్స్ హైస్కూల్, రిషి హైస్కూల్, పయనీర్స్ స్కూల్, సెయింట్ ఆర్నాల్డ్స్, కరుణ హైస్కూల్, ఎస్‌వీ జూనియర్ కళాశాలల్లో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. తొమ్మిది కేంద్రాల్లో 3,556 మంది అభ్యర్థులు హాజరు కాగా, 63 మంది గైర్హాజరయ్యారని నీట్ ఎంట్రెన్స్ కోఆర్డినేటర్ జ్యోతిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి, ఉంగరాలు, ముక్కుపుడకలు, నెక్లెస్‌లు, చెవిపోగులు, మెడల గొలుసులు, బూట్లు, మెట్టెలు తదితర ఆభరణాలను తొలగింపజేసిన తరువాతే కేంద్రాల్లోకి అనుమతించారు.


సంగారెడ్డిలో ఓ సెంటర్ వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న నీట్ అభ్యర్థులు

రూ.లక్షపైగా లావాదేవీలపై నిఘా

- డిజిటల్ చెల్లింపులపైన ఈసీ ప్రత్యేక దృష్టి

సిద్దిపేట అగ్రికల్చర్, మే 5: పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు, సరైన పత్రాలు లేని నగదును అధికారులు సీజ్ చేస్తున్నారు. అయినా నూతన మార్గాల ద్వారా డబ్బు చేరవేస్తుండడంతో ఎన్నికల సంఘం అలర్ట్ అయింది. బ్యాంకుల ద్వారా అధిక మొత్తంలో జరిగే లావాదేవీలపై నిఘా పెంచింది. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల లావాదేవీలను పరిశీలిస్తున్నారు. ఆపై లావాదేవీలు ఆదాయ పన్ను శాఖ పరిశీలించనున్నది. అధిక మొత్తంలో నగదు జమ, డ్రా చేయడం చేస్తే అలాంటి ఖాతాలకు సంబంధించిన వివరాలను సంబంధిత బ్యాంకు అధికారులు ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చేలా ఆదేశిస్తున్నారు. మహిళా సంఘాల ఖాతాలపైనా ఎన్నికల కమిషన్ నిఘా పెంచింది. బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు కాకుండా ఇతర వ్యక్తులు, సంస్థల నుంచి స్వయం సహాయక సంఘాలకు ఏవైనా నగదు వస్తున్నాయా..? లేదా అనే వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలనే తేడా లేకుండా గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా పెద్ద మొత్తంలో నగదు బదిలీ జరుగుతోంది. డిజిటల్ ఖాతాల ద్వారా రూ.లక్షల్లో లావాదేవీలు జరిగితే వివరణ తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు వారి బంధువుల ఖాతాల వివరాలను పరిశీలించే అవకాశాలు ఉంటాయని అధికారులు అంటున్నారు.

అబద్దాలతో గద్దెనెక్కి.. ప్రజల గుండెలపై తన్నారు


తూప్రాన్‌లో జరిగిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న హరీశ్‌రావు

- కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం నేర్పాలి
- రిజర్వేషన్లు తీసేసే బీజేపీకి ఓటు వేస్తారా?
- మాజీ మంత్రి హరీశ్‌రావు

తూప్రాన్, మే 5: దొంగమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలు.. గద్దెనెక్కిన తరువాత హామీలు అమలు చేయకుండా ప్రజల గుండెల మీద తన్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మెదక్ పార్లమెంట్ అభ్యర్థి పి.వెంకట్రామారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. ఐదు నెలల కాంగ్రెస్ పాలన రివర్స్ గేర్‌లో సాగుతున్నదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో అమలు చేసిన పథకాలను ప్రస్తుతం బంద్ చేశారని ఆరోపించారు. కాలిపోయే మోటార్లు, దొంగ కరెంటు అన్నట్టు పరిస్థితి తయారైందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే ప్రతిపక్ష నాయకుడని చూడకుండా కేసీఆర్ పేగులు తీసి మెడలో వేసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నాడని మండిపడ్డారు. ప్రజల తరఫున తాను అసెంబ్లీలో గట్టిగా కొట్లాడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సురుకు పెట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తీసేస్తారని, ఆ పార్టీకి ఎవరైనా ఓటు వేస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణకు కేసీఆర్, బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని అన్నారు.తూప్రాన్ నాయకులు, కౌన్సిలర్లు అధికారం కోసం, స్వార్థం కోసం పార్టీలు మారారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వారికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

అయితే తిట్లు.. లేదంటే ఒట్లు...

రామాయంపేట : అబద్దాలు.. లఫంగ మాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఎక్కడలేని హామీలిచ్చి జనాన్ని ముంచారని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రామాయంపేటలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అయితే తిట్లు.. లేదంటే దేవళ్లపై ఒట్లు వేస్తూ.. ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను మరిచిపోయారని అన్నారు. బీజేపీ దేవుడి పేరిట రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. పదేళ్లలో మోదీ పాలనలో జీఎస్టీ, పన్నులతో ప్రజలను ఆగం చేశారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రామాయంపేటలో మాట్లాడుతున్న హరీశ్‌రావు


రామాయంపేటలో రోడ్‌షోకు వచ్చిన జనం

పకడ్బందీగా ఈవీఎంల కమిషనింగ్

జిల్లా ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


నర్సాపూర్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మే 5: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో చేపడుతున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కమిషనింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. అనంతరం, నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. జిల్లాలో మెదక్, నర్సాపూర్‌లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విజయవంతంగా సాగుతున్నదని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి అవకాశం ఉన్నదని తెలియజేశారు. ఆయన వెంట ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

డిజైర్ సొసైటీలో ఉత్సాహంగా వేసవి శిబిరం



వేసవి శిబిరంలో చిన్నారులు, యువకులు

జిన్నారం, మే 5: హెచ్ఐవీ బాధిత చిన్నారుల కోసం బొల్లారం డిజైర్ సొసైటీలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం రెండోరోజు ఉత్సాహంగా సాగింది. పలు టీవీ, సీరియల్ నటీనటుల సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షో, ట్రేడేషన్ టీం, బెలూన్ టెస్టింగ్, డాన్సు, పెయిటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆరోగ్యంపై భానుడి ప్రతాపం

- ఎండలకు విజృంభించే వ్యాధులెన్నో
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలంటున్న వైద్యులు
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని సూచన

మెదక్ కల్చరల్ మే 5: వేసవిలో కేవలం ఎండలు, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడమే కాదు.. ఎండల వేడిమి ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశమున్నది. ఎండల నుంచి ఆరోగ్య రక్షణకు జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు. ఎండలతో అనేక రకాల వ్యాధులు, ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. వీటిలో ముఖ్యమైనవి ఆస్తమా, ఊపిరితిత్తుల సమస్య, చర్మ సమస్యలు, కలరా, విరేచనాలు, డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండెపోటు వంటి సమస్యలు కూడా ఎండాకాలంలో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఆస్తమాతో జాగ్రత్త

ఎండాకాలంలో ఆస్తమా మరింత ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆస్తమాతో బాధపడే పిల్లల్లో సమస్య ఎక్కువవుతుంది. వేసవి కాలంలో తేమ శాతం ఎక్కువగా ఉండడం వలన సూక్ష్మజీవులు, ఫంగస్ వంటివి ఎక్కువ అభివృద్ధి చెందుతాయి. ఎండాకాలంలో గాలిలో చేరే కాలుష్యం ఎక్కువ సేపు విస్తరిస్తూనే ఉంటుంది. ఈ కారణాలతో ఆస్తమా ఎక్కువయే అవకాశం ఉంది. అందుకే ఆస్తమా రోగులు వేసవి కాలంలో తమ వెంట ఆస్తమాకు వాడే ఔషధాలను తప్పకుండా ఉంచుకోవాలి. వీలైనంత వరకు దుమ్ము, ధూళి, కాలుష్యానికి దూరంగా ఉండాలి.

వేడి జలుబు



శీతాకాలంలో లాగానే వేసవి కాలంలోనూ తీవ్రమైన జలుబు చేసే అవకాశం ఉంటుంది. వేసవిలో రైనో, కరోనా, పర ఇన్ ఫ్లూయెంజా లాంటి రక రకాల వైరస్‌లు వస్తుంటాయి. చలి కాలంలో సంక్రమించే వైరస్‌ల కన్నా ఇవి మరింత ప్రభావంతంగా ఉంటాయి. వీటి వల్ల జలుబు కాకుండా శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి. డయేరియా, తల నొప్పి, ఎడతెగని దగ్గు వస్తాయి. మందులు వాడినా ఎక్కువ రోజులు ఇలానే ఉండే అవకాశం ఉంటుంది. దీంతో పాటు గొంతు నొప్పి, ముక్కులోని శ్లేష్మం మంటగా ఉంటుంది.

పలుచటి వస్త్రాలతో చర్మ వ్యాధుల నుంచి రక్షణ



ఎండాకాలం వేడి ఎక్కువగా ఉండడంతో పాటు సూర్యరశ్మిలోని అతినీలలోహిత కిరణాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఎక్కువ సేపు ఎండలో తిరిగితే చర్మం కమిలిపోయి, ఎర్రగా మారుతుంది. దీనినే సన్ బర్న్‌గా పిలుస్తారు. చిన్న చిన్న పొక్కులు ఏర్పడి మంటగా ఉంటాయి. ఎండలో చర్మం కమిలిపోకుండా ఉండేందుకు తెల్లని, పలుచటి వస్త్రాలు వేసుకోవాలి. ఎండలో బయటకు వెళ్లే ముందు సన్ స్క్రీన్ లోషన్‌లు రాసుకోవడం వలన ఫలితం ఉంటుంది.

ప్రాణాంతకమైన హైపర్ థర్మియా

అధిక వేడి కారణంగా మన శరీర ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతుంటాయి. దీంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటన్నిటిని కలిపి హైపర్ థర్మియాగా పిలుస్తారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, పెద్దలు దీని బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. సాధారణంగా మన దేహంలో అంతర్గతంగా ఉష్ణాన్ని నియంత్రించే వ్యవస్థలు ఉంటాయి. చర్మం, శ్వాసప్రక్రియ ద్వారా శరీరంలోని అధిక వేడి బయటకు వెళ్తుంది. కానీ ఎండలు బాగా పెరిగిపోయినప్పుడు శరీరం అధిక వేడిమిని తట్టుకోలేక, హైపర్ థర్మియా సమస్య మొదలవుతుంది. వడ దెబ్బ తగలడం, నీరసం, వికారం, వాంతులు, విరేచనాలు, తల తిరగడం, కండరాలలో వణుకు, పట్టు సడలిపోవడం, మతిస్థిమితం కోల్పోవడం, శ్వాస వేగం, గుండె కొట్టుకొనే వేగం పెరిగిపోవడం, తలనొప్పి వంటివి వస్తాయి. చివరకు కోమాలోకి వెళ్తారు. ఈ పరిస్థితి చాల ప్రమాదకరం. కొద్ది సమయం ఆలస్యం చేస్తే మరణించే అవకాశం కూడా ఉంటుంది.



కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ సమస్యలు

ఎండాకాలంలో మూత్ర నాళ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. కిడ్నీలో రాళ్లు ఏర్పడడానికి వేసవి పరిస్థితులు కారణమవుతాయి. ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. వేసవిలో శరీరానికి ఎక్కువగా నీరు అవసరం. శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుకోవడానికి చెమటను బయటకు ఎక్కువ స్రవించడంతో డిహైడ్రేషన్ పరిస్థితి వస్తుంది. దీంతో మూత్ర పిండాల్లో వడపోత సరిగా లేక రాళ్లు ఏర్పడుతాయి. దీంతో తరచూ మూత్ర నాళ సమస్యలు వస్తాయి. అందువలన వేసవిలో దాహం వేసినా.. వేయకపోయినా తరచూ నీరు తాగడం మంచిది అని వైద్యులు సూచిస్తున్నారు.

అనేక రోగాలకు నెలవు ఎండలు



వేసవి కాలం అనేక రోగాలకు కారణమవుతుంది. చర్మవ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, ఆస్తమా, డిహైడ్రేషన్ లాంటి వ్యాధుల వస్తుంటాయి. కొన్ని సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈసారి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అత్యవసరం అయితేనే బయటకు వెళ్లడం ఉత్తమం. ఒక వేళ బయటకు వెళితే నెత్తికి రుమాలు చుట్టుకొని వెళ్లాలి. ఎలాంటి అత్యవసరం ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- సూఫీ సుజాయత్ అలీ, డాక్టర్

సౌండ్ పెరిగితే సైలెన్సర్ తీసుడే..

- బుల్లెట్ బండ్లపై ట్రాఫిక్ పోలీసుల దృష్టి
- వాహనదారులకు భారీ జరిమానా
- రోడ్లపై బైక్ శబ్ధాలకు కళ్లెం వేస్తున్న పోలీసులు

సిద్దిపేట క్రైం, మే 5: సిద్దిపేట పట్టణంలో బుల్లెట్ బైక్‌ల నుంచి వచ్చే అధిక శబ్దానికి పోలీసులు కళ్లెం వేస్తున్నారు. బుల్లెట్‌రాయుళ్లు డబుల్ సైలెన్సర్లు పెట్టుకొని అధిక శబ్దం చేస్తూ రోడ్లపై వెళ్తూ ఇతర వాహనదారులను భయాందోళనకు గురి చేస్తున్నారని కొంతమంది సిద్దిపేట పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేసి భారీ జరిమానాలను విధిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజు ఉదయం సాయంత్రం పూట ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేసి డబుల్ సైలెన్సర్ బుల్లెట్లు, అధిక శబ్దం చేసే బుల్లెట్లను పట్టుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి సైలెన్సర్లను తీపిస్తున్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బుల్లెట్ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.



బుల్లెట్ల డబుల్ సైలెన్సర్లను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

బుల్లెట్ వాహనదారులకు భారీ జరిమానాలు

అధిక శబ్దం చేసుకుంటూ వెళ్తూ పట్టుబడిన బుల్లెట్ వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు భారీ జరిమానాలు విధిస్తున్నారు. డబుల్ సైలెన్సర్లను తీపించి, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు అధిక శబ్దంతో కలిగే నష్టాలను వివరిస్తున్నారు. డబుల్ సైలెన్సర్, అధిక శబ్దం చేసే బుల్లెట్ వాహనదారులకు రూ.2000 నుంచి రూ.3000 వరకు జరిమానా విధిస్తున్నారు. మరోసారి అధిక శబ్దంతో బుల్లెట్ వాహనాలు రోడ్లపై తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. గత వారం రోజుల్లో అధిక శబ్దం చేసే బుల్లెట్ వాహనదారులను పట్టుకొని 20 కేసులు నమోదు చేశారు. దాంతో బుల్లెట్ రాయుళ్లు భయాందోళనకు గురై రోడ్లపై మామూలు సౌండ్‌తో వెళ్తున్నారు.

బైపాస్ రోడ్‌లో బైక్ రైడ్స్‌పై ప్రత్యేక నిఘా

సిద్దిపేట పట్టణ చుట్టుపక్కల గల బైపాస్ రోడ్డుతో పాటు రంగనాయక సాగర్ కట్టపైన కొంతమంది యువకులు రాత్రిపూట బైక్ రైడ్స్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ బైక్ రైడ్స్‌పై పోలీసులకు కూడా సమాచారం అందడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

అధిక శబ్దం చేస్తూ బుల్లెట్లు నడిపితే చర్యలు తప్పవు



అధిక శబ్దంతో బుల్లెట్లను నడుపుతూ శబ్ద కాలుష్యాన్ని చేస్తున్న వాహనదారులను ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేసి పట్టుకుంటున్నాం. సైలెన్సర్లు తీపించి, జరిమానా విధిస్తున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి. త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌పై ఇప్పటివరకు 50 కేసులు నమోదు చేశాం. అధిక శబ్ద కాలుష్యాన్ని కలుగజేస్తున్న డబుల్ సైలెన్సర్ల బుల్లెట్లను 10 వరకు సీజ్ చేశాం.

- బి.అనురాధ, సిద్దిపేట సీపీ

చెరువులో మునిగి ఇద్దరి మృతి

- చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు.. మృతదేహం కోసం వెళ్లి మరొకరు..



కిష్టయ్య, కిరణ్ (ఫైల్)

వట్‌పల్లి, మే 5: చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి చెందగా.. ఆ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వెళ్లిన మరో వ్యక్తి కూడా నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని కేరూరు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కెరూర్ గ్రామానికి చెందిన బరుగు కిరణ్(23) శనివారం సాయంత్రం స్థానికంగా ఉన్న చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. మృతదేహం కోసం గ్రామస్థులు గాలించగా లభించలేదు. ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన చిన్నెల్లి కిష్టయ్య(53) చెరువులోకి దిగి మృతదేహాన్ని గాలిస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు కిష్టయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు గజ ఈతగాళ్లను రప్పించి కిరణ్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న కారు

అల్లాదుర్గం, మే 5: షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధమైన సంఘటన మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ గ్రామ సమీపంలోని 161వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. హైదరాబాద్ నుంచి నారాయణ ఖేడ్‌కు వెళ్తున్న కారు ముస్లాపూర్ గ్రామ శివారులోకి రాగానే కారు ముందు భాగంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కారు డ్రైవర్ అనుగొండ కుర్మయ్య అందులో ఉన్న మరో నలుగురిని దింపివేశారు. అప్పటికే మంటలు కారు చుట్టూరా వ్యాపించడంతో పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయమై స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

కరెంటు బిల్లు ఎక్కువ వచ్చిందని వృద్ధ దంపతులపై దాడి



గోడును వెళ్లబోసుకుంటున్న వృద్ధ దంపతులు

కౌడిపల్లి, మే 5: వాటర్ ప్లాంట్‌లో పని చేసుకుంటూ, అదే ఇంట్లో కిరాయికి ఉంటున్న వృద్ధ దంపతులపై కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చిందని ఇంటి యజమాని దాడి చేయడంతో పాటు పరుషపజాలంతో దుషించిన సంఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మిబాయి-బాలకృష్ణ వృద్ధ దంపతులకు ఇద్దరు కుమారులు. కొడుకులిద్దరూ ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వృద్ధ దంపతులు కౌడిపల్లిలోని ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ, అదే ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. నీరు తీసుకునేందుకు వచ్చిన వారి నుంచి డబ్బులు తీసుకోవడమే వీరి పని. వాటర్‌ప్లాంట్ ఉన్న గది, వృద్ధులు అద్దెకున్న గది, పక్కనే ఉన్న ఓ మెడికల్ షాపునకు కలిపి ఒకటే విద్యుత్ మీటరు ఉంది. ప్రతీ నెల రూ.15వందల వరకు బిల్లు వచ్చేది. ఈ నెల రూ.1500-1600 మధ్య బిల్లు వచ్చింది. కరెంటు బిల్లు ఎక్కువగా ఎందుకొచ్చిందంటూ శనివారం రాత్రి బాలకృష్ణపై ఇంటి యజమాని ప్రతాప్‌రెడ్డి దాడి చేశాడు. లక్ష్మిబాయిని పరుషపదజాలంతో దూషించాడు. ఇంట్లోని వస్తువులను బయట విసిరి పారేస్తాని బెదిరించాడు. మెడికల్ షాపు నిర్వాహకులను మాత్రం ఏమీ అనకపోవడం గమనార్హం. ఆదివారం అటుగా వెళ్తున్న స్థానికులకు దాడి విషయాన్ని వృద్ధ దంపతులు చెప్పడంతో వెలుగులోకి వచ్చింది. వృద్ధ దంపతులపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కూలర్‌లో మంటలు

- ఇంటికి అంటుకుని రూ.4.5లక్షల ఆస్తి నష్టం

మునిపల్లి, మే 5: షార్ట్ సర్క్యూట్‌తో కూలర్‌లో మంటలు చెలరేగి, ఇంటికి అంటుకోవడంతో రూ.4.5ఆస్తి నష్టం జరిగిన సంఘటన సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన మునిపల్లిలో ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన మునిపల్లి గ్రామానికి చెందిన షేక్ మోసిన్ తన కుటుంబ సభ్యులతో కలిసి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఈ-11 బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. అందులోనే వారు లేడీస్ టైలరింగ్‌తోపాటు దుస్తుల షాపును నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఎండాకాలం కావడంతో ఇంట్లో ఉన్న కూలర్‌ను ఆన్ చేసి మర్చిపోయి బయటకు వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి కూలర్‌లో మంటలు చెలరేగి, ఇంట్లోని వస్తులవులకు అంటుకున్నాయి. ఇంటి నుంచి వస్తున్న పొగలను గమనించిన స్థానికులు విషయాన్ని మోసిన్‌కు తెలియజేశారు. వారు వచ్చేలోపే దుస్తుల షాపు, ఫర్నీచర్‌తోపాటు ఇంట్లో ఉన్న వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లోఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం ప్రమాదం తప్పింది. రూ.4.5ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మునిపల్లి ఎస్ఐ సురేష్ పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఐఐటీహెచ్‌లో ఆలిండియా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ మీట్



ఐఐటీహెచ్‌లో నూతన పరిశోధన పరికరాల డిజైన్లను పరిశీలిస్తున్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి

కంది, మే 5: పరిశ్రమలకు అనుసంధానం చేయడానికి వినూత్న పరిశోధనల పరికరాల డిజైన్లను ప్రదర్శించేందుకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం ఆలిండియా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి, జాయింట్ సెక్రెటరీ నీతా ప్రసాద్‌లతో పాటు ఐఐటీహెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, దేశంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా ఐఐటీహెచ్‌లోని డిజైన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ జాన్ మథ్యూ ఆధ్వర్యంలో రూపొందిన వినూత్న పరిశోధనల పరికరాల డిజైన్ల నమూనాలను ప్రదర్శించారు. డిజైన్లను పరిశీలించిన సంజయ్‌మూర్తి భవిష్యత్తులో ఏఐ, లాజిస్టిక్స్ ఆధారిత నమూనాలను రూపొందించాలని సూచించారు. అలాంటి డిజైన్లకు తాము మద్దతు ఎలా ఇవ్వగలమో తెలిపారు. అనంతరం ఇంటర్ డిసిప్లీనరిని ప్రోత్సహించడం, డిజైన్ ఆధారిత విద్యతో పాటు సరికొత్త ప్రాజెక్ట్‌ను ఆవిష్కరించేందుకు సన్నాహకాలు చేశారు. వ్యవస్థాపక ఉత్పత్తి మార్కెట్ కోసం విద్యాసంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా ప్రయోగశాలలు మొదలైన వాటి మధ్య విజ్ఞాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఆలిండియా డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ మీట్ ఒక వేదికగా మారిందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.

అదృశ్యమైన సొసైటీ మాజీ చైర్మన్ మృతి



సత్యనారాయణ (ఫైల్)

కొల్చారం, మే 5: అదృశ్యమైన కొల్చారం సొసైటీ మాజీచైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మ్యాదరి సత్యనారాయణ(50) మృతదేహం ఆదివారం మెదక్ మండలం మంబోజిపల్లి శివారులోని పంటపొలాల్లో లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. 2010 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేసిన సత్యనారాయణ ఉద్యమకాలంలోనే సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారంరోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా మంబోజిపల్లి వద్ద బస్సు దిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. కాగా ఆదివారం మెదక్ మండలం మంబోజిపల్లి శివారులోని పంటపొలాల్లో సత్యనారాయణ మృతదేహం లభ్యమైంది. వడదెబ్బతో మృతిచెందాడని పోలీసులు తెలిపారు. కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వెల్దుర్తి మండలంలోని అందులపల్లి ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునితారెడ్డి



రామచంద్రాపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



వర్గల్ మండలం మజీద్‌పల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- లోక్‌సభ ఎన్నికల్లో వెంకట్రామారెడ్డిని గెలిపించండి
- వెల్దుర్తి మండల ప్రచారంలో ఎమ్మెల్యే సునితారెడ్డి

వెల్దుర్తి, మే 5: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తితో పాటు మండలంలోని యశ్వంతరావుపేట, మంగళపర్తి, మానేపల్లి, అందుగులపల్లి, మహ్మద్‌నగర్‌తండా, ధర్మారం, దామరంచ, అక్కంపల్లి, కుకునూర్, బస్వాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ అమలుకాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో కాలం వెళ్లదీస్తోందని, కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలనిఅన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాపై పూర్తి అవగాహన ఉన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే ఈనెల 8న నర్సాపూర్‌లో కేసీఆర్ రోడ్‌షో ఉన్నదని, నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కుకునూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాగా మాసాయిపేట చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వెల్దుర్తి, మాసాయిపేట మండలాధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా బీఆర్ఎస్: ఎమ్మెల్యే

రామచంద్రాపురం, మే 5: పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ సొసైటీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. బీహెచ్ఇఎల్ సంస్థలో పని చేసి పదవీ విరమణ చేసి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ముందుందని చెప్పారు. వెంకట్రామారెడ్డి సతీమణి ప్రణీతరెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ప్రజలంతా రుణపడి ఉండాలి

వర్గల్/కుకునూరుపల్లి మే 5: గజ్వేల్ నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి చేసిన మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రజలు మరువొద్దని, ప్రజలంతా కేసీఆర్‌కు రుణపడి ఉండాలని ఎఫ్‌డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం మజీద్‌పల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లతారమేష్‌గౌడ్, తాజా, మాజీ సర్పంచ్ లతాశివగౌడ్, జడ్పీటీసీ బాలుయాదవ్, నాయకులు పాల్గొన్నారు. అలాగే కుకునూరుపల్లి, మంగోల్ గ్రామాల్లో వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎఫ్‌డీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవి రవీందర్, నర్రా జైపాల్‌రెడ్డి, భద్రప్ప, కోల సద్గుణ రవీందర్, అమరేందర్‌గౌడ్, కిరణ్‌కుమార్‌చారి పాల్గొన్నారు.

కేసీఆర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉందాం

గజ్వేల్, మే 5: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉందామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గజ్వేల్ దశ-దిశను మార్చిన కేసీఆర్ బలపరిచిన బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ అరుణాభూపాల్ రెడ్డి, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య తదితరులున్నారు. అలాగే గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో గజ్వేల్ ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ప్రచారాన్ని నిర్వహించారు.

మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ కైవసం

ములుగు, మే 5: అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి విజయం సాధిస్తారని ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ములుగు మండలం వంటిమామిడి, చిన్న తిమ్మాయపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా, మాజీ సర్పంచ్ హంస మహేష్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, జుబేర్‌తో కలిసి అంజిరెడ్డి మాట్లాడారు. ఈ ప్రచారంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్నగౌడ్, బాల్‌రెడ్డి, లింగారెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.



మాసాయిపేట: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

మనువాద బీజేపీ, కాంగ్రెస్‌ను ఓడించండి

మాసాయిపేట, మే 5: మనువాద బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించి, వర్గీకరణకు మద్దతు తెలిపిన బీఆర్ఎస్‌ను గెలిపించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పెంజర్ల రమేష్, యువసేన నాయకులు పాల్గొన్నారు.

●**దౌల్తాబాద్:** దౌల్తాబాద్ మండలం లింగాయిపల్లితండాలో జడ్పీటీసీ రణంజ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు బండారు దేవేందర్, మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు యాదవరెడ్డి, కన్నరెడ్డి, గడ్డమీది నాగరాజు తదితరులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**కొండపాక:** కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, పార్టీ మండలాధ్యక్షుడు నూనె కుమార్, రైతుబంధు సమితి మాజీ కో ఆర్డినేటర్ దుర్గయ్య, కనకయ్య ప్రచారం నిర్వహించారు.

కేంద్రంలో బీజేపీదే విజయం: బీబీ పాటిల్

రేగోడు మే 5: దేశమంతా మోదీ గాలి కొనసాగుతోందని, కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం రేగోడు చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బీబీ పాటిల్ మాట్లాడారు. దేశం కోసం, ధర్మం కోసం, అభివృద్ధి కోసం బీజేపీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గ్రామాల్లో ఉన్నదన్నారు. మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు తనను గెలిపించాలంటూ కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదని జూకల్ మాజీ ఎమ్మెల్యే గంగారం అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అందోల్ ఇన్‌చార్జి జగదీశ్వర్, నాయకులు సంగమేశ్వర్, సతీష్‌గౌడ్, వీరప్ప, చందు, రాజు పాల్గొన్నారు. బీబీ పాటిల్ ఆధ్వర్యంలో ఆర్ ఇటిక్యాల, రేగోడు, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు.



రేగోడులో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

రఘునందన్‌రావుకు మద్దతుగా ప్రచారం



పెద్దశంకరంపేట మండలం టెంకటిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



వర్గల్ మండలం గోవిందాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ మండల నాయకులు

వర్గల్, మే 5: బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు టేకుపల్లి బాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం గోవిందాపూర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కరపత్రాలు పంచుతూ నరేంద్రమోదీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమలో బీజేపీ నాయకులు పంపరి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం మండలంలో

కొల్చారం, మే 5: కొల్చారం మండలం సీతారాంతండా, తుక్యాతండాలో బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్‌బాబు జాదవ్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవీందర్‌నాయక్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్, కొల్చారం మండల పార్లమెంట్ ఇన్‌చార్జి రమణారావు, ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం ప్యాడ్లతో ఇంటింటి ప్రచారం

పెద్దశంకరంపేట, మే 5: పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఇసుకపైలతండా, టెంకటి, మక్తలక్ష్మాపూర్, రామోజీపల్లి, మల్కాపూర్, బూరుగుపల్లి, పెద్దశంకరంపేట తదితర గ్రామాల్లో బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఈవీఎం ప్యాడ్లతో ఇంటింటికి తిరుగుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు గ్రామ గ్రామాన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దామోదర్, వడితే సుభాష్, అశోక్, సూర్యకుమార్, సుధాకర్, సురేష్, అంజయ్య, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నడూ అంబేడ్కర్‌ను గౌరవించలేదు

- మొదటి నుంచీ ఆ పార్టీ తీరే అంత
- ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు
- దళితుడిని సీఎం చేస్తామని మోసం చేసిన కేసీఆర్
- దళిత సమ్మేళనంలో కొలార్ ఎంపీ మునిస్వామి



మెదక్‌లో నిర్వహించిన దళిత సమ్మేళనంలో దండోర మోగిస్తున్న కొలార్ ఎంపీ మునిస్వామి, బీజేపీ నేతలు

మెదక్ అర్బన్, మే 5: కాంగ్రెస్ తీరే అంత అని, మొదటి నుంచి అంబేడ్కర్‌ను అవమానిస్తూ వచ్చిందని కొలార్ ఎంపీ మునిస్వామి విమర్శించారు. ఆదివారం రాత్రి మెదక్‌లోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన దళిత సమ్మేళనంలో కొలార్ ఎంపీ మునిస్వామి పాల్గొని మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎప్పుడూ అంబేడ్కర్‌ను గౌరవించలేదన్నారు. 60 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఒకే కుటుంబంలోని ముగ్గురు(నెహ్రూ, ఇందిరా, రాజీవ్) నాయకులు మరణించిన వెంటనే వారికి భారతరత్న ప్రటించిన కాంగ్రెస్ అంబేడ్కర్‌కు మాత్రం ఈ అవార్డును ప్రకటించకుండా అవమానించిందని దుయ్యబట్టారు. గత ఎన్డీఏ ప్రభుత్వంలో అటల్ బిహారి వాజ్‌పేయి కృషితో అంబేడ్కర్‌కు భారతరత్న ప్రకటించిందని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసులో సీఎం రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఫ్రీ బస్సు తప్ప ఏ హామీ అమలు చేయలేదన్నారు. రైతులకు రుణమాఫీ ఎక్కడని, మహిళలకు రూ.2500 ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు తెలంగాణలో ఓటు అడిగే హక్కులేదన్నారు. దళితుడిని సీఎం చేస్తామని మాజీ సీఎం కేసీఆర్ మోసం చేశారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే వేస్ట్ అవుతుందని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఆ రెండు పార్టీలను ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని మోదీ కుటుంబసభ్యులన్నీ వారందరీ అభివృద్ధి, సంక్షేమం, ఆరోగ్యమే బీజేపీ సర్కార్ ధ్యేయమన్నారు. తెలంగాణలోని 17 స్థానాల్లో బీజేపీని గెలిపించాలన్నారు. మెదక్ పార్లమెంట్ ఎంపీగా రఘునందన్‌రావును భారీ మెజారిటీతో గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాష, రాష్ట్ర నాయకులు పాండు, జగన్, జిల్లా అధ్యక్షులు యాదగిరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పార్లమెంట్ ఇన్‌చార్జి లక్ష్మీనర్సయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, సతీష్, రాములు పాల్గొన్నారు.

తనకు కేటాయించిన ఎమ్మెల్యే స్టిక్కర్.. మరో వాహనానికి..!

బంజారాహిల్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన వాహనానికి అతికించుకోవడానికి స్టిక్కర్ కేటాయించారు. ఆ స్టిక్కర్ వేరే వ్యక్తి తన వాహనానికి అతికించుకుని తిరుగుతున్నాడని ఆ ఎమ్మెల్యే పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి వాహనానికి ఆయన పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్ కేటాయించారు. ఆ స్టిక్కర్ వేరే వ్యక్తి చేతుల్లోకి వెళ్లడంతో ఆయన తన వాహనానికి ఆ స్టిక్కర్ పెట్టుకుని తిరుగుతున్నాడు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో ఆయన పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

రమణీయంగా పుష్పరథోత్సవం

గజ్వేల్, మే 5: గజ్వేల్‌లోని పురాతన శ్రీసీతారామ, ఉమామహేశ్వర ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పుష్పరథోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆలయం నుంచి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పుష్పరథంలో ఉంచి పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం వరకు ఊరేగించారు. అంగడిపేట హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారిని ప్రజలు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ రథోత్సవంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కాల్వ శ్రీధర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు ఎన్‌సీ శ్రీనివాస్, శ్రీధర్, నర్సింగరావు, బాల్‌కుమార్, ఆలయ పూజారులు దేశపతి రాజశేఖరశర్మ, శ్రీనివాసాచార్యులు, నందబాల శర్మ, మఠం శివకుమార్ ఉన్నారు.



పుష్పరథాన్ని లాగుతున్న భక్తులు

హుస్నాబాద్ మామిడి ఉత్తరాఖండ్‌కు..

- తామెర పువ్వు పురుగుతో తగ్గిన దిగుబడి..
- టన్ను మామిడి కాయలకు రూ.25 వేల నుంచి రూ.40 వేలు
- దసిరీ మామిడికి రూ.40 వేల నుంచి రూ.45 వేలు



కొనుగోలు చేసిన మామిడి కాయలు

హుస్నాబాద్, మే 5: హుస్నాబాద్ ప్రాంత మామిడి కాయలు ఉత్తరాఖండ్‌కు రవాణా అవుతున్నాయి. గత 20 రోజుల క్రితం గుర్రాల సందీప్ అనే కమీషన్ ఏజెంట్ మామిడి కాయల కొనుగోలు కేంద్రాన్ని పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దశాబ్దాల నుంచి ఈ ప్రాంత మామిడి రైతులు వరంగల్, కరీంనగర్, నాగ్‌పూర్ వంటి పట్టణాలకు వెళ్లి విక్రయించే వారు. నాలుగేళ్ల నుంచి హుస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు దీనిని వినియోగించుకుంటున్నారు. హుస్నాబాద్ డివిజన్‌లో దాదాపు 1,600 ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో బంగినిపల్లి, దసరీ, కోత మామిడి తోటలు ఉండగా ఈ పండ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఈసారి వర్షాభావ పరిస్థితులకు తోడు తామెర పురుగు వల్ల మామిడి కాత అనుకున్నంతగా రాలేదు. దిగుబడి తగ్గడమే కాకుండా ధర కూడా అంతగా లేకపోవడంతో మామిడి రైతులకు నష్టాలు తప్పలేదు. పూత బాగానే వచ్చినప్పటికీ తామెర పురుగు కాయ రాకుండా పూతను తినేసిందని రైతులు పేర్కొన్నారు. దీనికి మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండాపోయింది. రెండేళ్ల క్రితం టన్నుకు రూ.70వేల వరకు ఉన్న ధర ఈ రెండేళ్ల నుంచి రూ.25 వేల నుంచి రూ. 40 వేలకు పైగా పెరగడం లేదు. దసిరీకి మాత్రం ప్రస్తుతం టన్నుకు రూ.45 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది హుస్నాబాద్ కేంద్రంలో 400 టన్నుల వరకు కొనుగోలు చేశారు. కానీ ఈసారి ఆ పరిస్థితి లేదు.



మామిడి కాయలను ప్యాక్ చేస్తున్న కూలీలు

వివిధ రాష్ట్రాలకు ఎగుమతి..

హుస్నాబాద్ ప్రాంతంలో కొనుగోలు చేసిన మామిడి కాయలను ఇక్కడి నుంచి ప్యాక్ చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరఖండ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ధర రూ.40 వేలకు మించడం లేదు..

మేలు రకంగా ఉన్న బంగినిపల్లి మామిడి కాయలకు టన్నుకు రూ.40 వేలకు కొనుగోలు చేస్తున్నారు. నాసిరకంగా ఉన్నవాటికి రూ.20 నుంచి 25 వేల వరకు ధర ఇస్తున్నారు. రెండేళ్ల క్రితం ఇవే కాయలకు టన్నుకు రూ.70వేల వరకు కొనుగోలు చేశారు. ఈసారి దిగుబడి తగ్గడంతో పెట్టుబడులు వచ్చే పరిస్థితులు లేవని రైతులు పేర్కొంటున్నారు.

అనుకున్న ధర రావడం లేదు



ఈ సారి మామిడికి అనుకున్న ధర రావడం లేదు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులకు తోడు తామెర పురుగు కనపడకుండా పూతను తినేసింది. ఎన్ని మందులు కొట్టినా ఫలితం లేకుండా పోయింది. దిగుబడి తగ్గినా ధర వస్తుందని అనుకున్నాం. కానీ ధర కూడా అనుకున్నంత రావడం లేదు. మంచి బంగినిపల్లి మామిడి కాయకు టన్నుకు రూ. 35 నుంచి రూ. 40వేలు పెడుతున్నారు. మామిడి రైతులకు ఈ సంవత్సరం నష్టాలే వచ్చాయి.

- అయిలేని శంకర్‌రెడ్డి, మామిడి రైతు, హుస్నాబాద్

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

● కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్

కొల్చారం, మే 5: మండలంలోని ఇసుక మాఫియా ఆగడాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆదివారం కొల్చారం ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుక్కాపూర్, కొంగోడు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్టు పోలీసులకు విశ్వసనీయంగా సమాచారమందింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తుక్కాపూర్ శివారులోని మంజీరానదిలో శనివారం రాత్రి అయిదు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోగా, ఆదివారం తెల్లవారుజామున కొంగోడు శివారులోని హల్దీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నేడు బసవేశ్వర విగ్రహావిష్కరణ


రేగోడులో బసవేశ్వర విగ్రహం

రేగోడు మే 5: రేగోడులోని బసవేశ్వర చౌక్ వద్ద విశ్వ గురు మహాత్మా శ్రీబసవేశ్వర నూతన విగ్రహాన్ని సోమవారం పీఠాధిపతులు ఆవిష్కరించనున్నట్టు వీర శైవ లింగాయత్ సంఘం నాయకులు ఆదివారం తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ మహోత్సవానికి బిమ్కుంద పీఠాధిపతి సోమలింగ శివాచార్య మహారాజ్, బాల్కి బసవ కళ్యాణ్ పీఠాధిపతి బసవ లింగ పట్టాదేవరు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం శ్రీ బసవేశ్వరుని శోభాయాత్ర అనంతరం విగ్రహావిష్కరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.


నారాయణఖేడ్: ముడుగుంటల్ సమీపంలో మిషన్ భగీరథ నీటితో మడుగును తలపిస్తున్న రహదారి, జహీరాబాద్‌లోని పస్తాపూర్ వద్ద వృథాగాపోతున్న నీరు

భగీరథ పైపులైన్ లీకేజీలు ఎవరికీ పట్టవా?

● మండు వేసవిలో నీటి వృథాపై ప్రజల మండిపాటు

కంది/నారాయణఖేడ్/జహీరాబాద్, మే 5: అసలే మండు వేసవి.. హైదరాబాద్, బెంగుళూరు వంటి మహా నగరాల్లో నీటి సమస్య ఎంత తీవ్రంగా ఉందో తెలిసిందే. నీటిని వృథా చేయొద్దని ప్రభుత్వం, ఉన్నతాధికారులు సూచిస్తున్నా, కిందిస్థాయి సిబ్బంది పనితీరు మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సంగారెడ్డి జిల్లాల్లోని వివిధ మండలాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ల నిర్వహణ సరిగా లేక లీకేజీలతో నీరు వృథాగా కావడం పట్ల స్థానికులు మండిపడుతున్నారు. ఎన్నో గ్రామాల్లో నీటి ఎద్దడి ఎదుర్కొంటుంటే అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


కంది మండలం ఎద్దుమైలారం శివారులో మంజీరా పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న నీరు

వివరాల్లోకి వెళ్తే.. కంది పరిధిలోని ఎద్దుమైలారం శివారులో ఉన్న మంజీరా పైప్‌లైన్ లీకేజీ అయి నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. మంజీరా పైప్‌లైన్ లీకేజీ నీరు వృథాగా పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. వెంటనే అధికారులు తగిన చర్యల తీసుకుని పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా శనివారం నారాయణఖేడ్ మండలం ముడుగుంటల్ సమీపంలో బీదర్-నిజాంపేట జాతీయ రహదారిపై మిషన్ భగీరథ నీరు చేరి మడుగును తలపించింది. పక్కన ఉన్న పొలాల్లోకి కూడా నీరు చేరింది. జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్ బైపాస్‌కు వెళ్లే రోడ్డుపక్కన పైపులైన్ లీకై మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి, నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


వెల్దుర్తిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి, మే 5: వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయసమ్మేళనాన్ని నిర్వహించారు. సుమారు 16 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత పూర్వ విద్యార్థులందరూ ఒక్కచోట కలుసుకోవడంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ పరస్పర యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఆనాటి మధురస్మృతులను నెమరువేసుకుంటూ ఆటపాటలతో రోజంతా సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలతో సన్మానించారు.

తెలంగాణ ప్రదేశ్ లీగల్‌సెల్ కన్వీనర్‌గా దినేష్



సంగారెడ్డి రూరల్, మే 5 : తెలంగాణ ప్రదేశ్ లీగల్ సెల్ కన్వీనర్‌గా జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి చెందిన దినేష్‌ని నియమిస్తూ టీపీఎల్ఎస్ హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ శాఖ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చిన జాతీయ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ప్రదేశ్ లీగల్‌సెల్ హ్యూమన్ రైట్స్ డిపార్ట్‌మెంట్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ పోటీల విజేత గడ్డపోతారం జట్టు


ప్రథమ బహుమతి గెల్చుకున్న గడ్డపోతారం జట్టు

జిన్నారం, మే 5: అండూర్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీలో గడ్డపోతారం జట్టు మొదటి స్థానంలో నిలిచింది. వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో పలు జట్లు పోటీ పడగా ఆదివారం అండూర్ జట్టుపై గడ్డపోతారం జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్, మే 5: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను ప్రవేశాలు పొందేందుకు వీలుగా ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దోస్త్ యాప్ ద్వారా డిగ్రీ మొదటిసంవత్సరంలో చేరేందుకుగాను దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ ఇంగ్లిష్, ఉర్దూ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అబద్ధపు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం

● దుబ్బాక ఎమ్మెల్యే పల్లా

మద్దూరు, మే 5: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల్ని మోసం చేస్తున్నదని, కొట్లాడి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చిన మాజీ సీఎం కేసీఆర్ హామీలపై నిలదీస్తే గుడ్లు పీకేస్తానని, పండబెట్టి తొక్కుతానని, పేగులు మెడకేసుకుంటానని అంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మద్దూరు మండలంలోని లద్నూరు, ధర్మారం, మర్మాముల, సలాఖ్‌పూర్, నర్సాయపల్లి, గాగిల్లాపూర్, రేబర్తి, వంగపల్లి, వల్లంపట్ల, మద్దూరు గ్రామాల్లో బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గాగిల్లాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తను లోకల్ కాదని, గెలిచాక ఇక్కడ ఉండడని తప్పుడు ప్రచారం చేశారన్నారు. తాను ఇక్కడే ఉంటూ ఈ ప్రాంత ప్రజలకు ఆస్పత్రి ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలత మల్లేశం, పార్టీ దూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి, మాజీ సర్పంచులు బొల్లు కృష్ణవేణి చంద్రమౌళి, వంగ భాస్కర్‌రెడ్డి, నాయకులు కమలాకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జగదేవ్‌పూర్, మే 5: జగదేవ్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992-93లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గత స్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా సందడి చేశారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి.

బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటుతో బుద్ధి చెప్పండి

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి, మే 5: రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ పార్టీల పని అయిపోయిందని, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో తగిన గుణపాఠ చెపాల్పని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మునిపల్లిలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్‌పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు బడా నాయకులకు దోచి పెట్టింద్రు తప్ప.. ఏమీ అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశంలో మండల కేంద్రమైన రాయికోడ్‌కు నేషనల్ స్పోర్ట్స్ కళాశాలను మంజూరు చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం దానిని సిద్దిపేటకు తీసుకెళ్లిందన్నారు. అలాగే సీఎస్ఆర్ నిధులు సైతం సిద్దిపేట, సిరిసిల్లకు తీసుకెళ్లడంతో జహీరాబాద్, సంగారెడ్డి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బుదేరాలో మహిళా డిగ్రీ కళాశాల, మండలానికో మోడల్ స్కూల్, మార్కెట్ యార్డులు తదితర వాటిని తీసువచ్చిన ఘనత గత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తోందని, గత పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలే తగిన బుద్ధి చెప్పారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎంపీ ఎన్నికల్లో జహీరాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగిరేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థితో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణలో పోస్టల్ ఓటుకు అవకాశం కల్పించండి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 5: ఎన్నికల శిక్షణలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ కేంద్రాల వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే అవకాశం కల్పించాలని యూటీఎస్ రాష్ట్ర కోశాధికారి డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఆదివారం యూటీఎఫ్ నాయకులు పోస్టల్ బ్యాలెట్ ఓటుని వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులందరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు 7, 8 తేదీల్లో నిర్వహించే శిక్షణ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని ఆర్డీవో వసంతకుమారిని వినతిపత్రం అందజేశారు. మొదటి విడతలో శిక్షణకు హాజరై వడదెబ్బ, ఇతర అనారోగ్యాలకు గురైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇదే విషయమై డీఈవో వెంటకటేశ్వర్లుతో చర్చించామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో యూటీఎఫ్ నాయకులు సాయిలు, శ్రీనివాస్‌రావు, అనురాధ, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలకు పదోతరగతి పునాది



సంగారెడ్డిలో పదోతరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రశంసాపత్రాలతో సన్మానిస్తున్న ఇంపాక్ట్ క్లబ్ సభ్యులు

సంగారెడ్డి రూరల్, మే 5: ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు 10వ తరగతి పునాదిలాంటిదని ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ రాజేశ్వర్ పేర్కొన్నారు. సంగారెడ్డిలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పదవ తరగతిని తొలిమెట్టుగా స్వీకరించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నరసింహాచారి, పీఆర్‌వో నందకుమార్, సభ్యులు కిషన్‌రావు, మల్లికార్జున్‌పాటిల్, జగదీశ్వర్, సంతోష్‌కుమార్, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

● రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు శ్రీహరిరావు

మెదక్ అర్బన్, మే 5: తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. కేంద్రంలో బీజేపీ సర్కార్ రైతులను మోసం చేస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యలపై బీఆర్ఎస్, బీజేపీలకు చిత్తశుద్ధి లేదన్నారు. పంటలకు మద్దతు ధర కేటాయింపులో కేంద్ర సర్కార్ రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. స్వామినాథ్ కమిషన్ సిఫారసుల మేరకు మద్దతు ధర ఇస్తామని చెబుతున్న కేంద్రం రైతులను దగా చేస్తోందన్నారు. కమిషన్ సిఫారసు ప్రకారం రైతు, కౌలు పెట్టిన పెట్టుబడి, భార్యభర్తలు పని చేసిన ఖర్చు అంతా లెక్కించి 50 శాతం అదనంగా ఇవ్వాలన్నారు. 2023-24లో రాష్ట్ర సర్కార్ వరికి క్వింటాల్‌కు రూ.5,076 మద్దతు ధర ఇవ్వాలని కేంద్రానికి పంపితే బీజేపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా రూ. 2,183గా నిర్ణయించిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోగా రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధులు రామచంద్రగౌడ్, జహీరొద్దిన్, రాంకుమార్, సిద్దిరాములు, వినోద్‌కుమార్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపికృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర రైతుసమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

మోదీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదం

● కార్యకర్తల సమావేశంలో మంత్రి కొండాసురేఖ

మెదక్, మే 5: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని సంక్షోభంలో పడేస్తారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. రిజర్వేషన్లను రద్దుపర్చే దిశగా బీజేపీ అడుగులు వేస్తోందని మేధావులు సైతం అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. రామమందిర నిర్మాణం పేరుతో హిందూ ఓటర్లను ఆకర్షించేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. బహుజనులు, వెనకబడిన వర్గాలు, మేధావులు, మైనార్టీలు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించి రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ గెలుపును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అబద్ధపు ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సమావేశంలో మున్సిపల్ చైరన్‌చంద్రపాల్, కౌన్సిలర్లు బొద్దుల కృష్ణ, కళ్యాణి మధుసూదన్, దాయర లింగ, శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు తప్పని తిప్పలు


ఆలయ సమీపంలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

చేర్యాల, మే 5: కొమరవెల్లి మల్లికార్జునస్వామి దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తజనమై సందడిగా మారాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి, ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాకపెట్టి పెట్టారు. ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా కొమురవెల్లి మల్లన్న ఆలయ సమీపంలోని పోలీసు బొమ్మ వద్ద డ్రైనేజీ కాలువ లీకేజీతో, స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయ వర్గాలు గానీ ఇటు గ్రామపంచాయతీ గానీ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో డ్రైనేజీ కాలువ నీరు దుర్వాసనవెదజల్లుతు రోడ్డుపై ప్రవహించాయి.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

సిద్దిపేట క్రైం, మే 5 : బైక్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో భర్త అక్కడికక్కడే మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక రంగీల ధాబా చౌరస్తాలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట పట్టణ శివారులోని కేసీఆర్ నగర్(డబుల్ బెడ్ రూమ్స్) కాలనీకి చెందిన ఏదుల్(45) తన భార్య నస్రీన్ తో కలసి బైక్‌పై రంగీలా ధాబా చౌరస్తాలో రోడ్డు క్రాస్ చేస్తుండగా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏదుల్ అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా నస్రీన్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బండి సంజయ్ సమక్షంలో చేరికలు

బెజ్జంకి, మే 5: మండలంలోని దేవక్కపల్లి గ్రామంలోని రెడ్డి సంఘం, యాదవ సంఘానికి చెందిన పలువురు నాయకులు, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి బండి సంజయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం


విద్యార్థినికి నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తున్న అశోక్ రెడ్డి

బెజ్జంకి, మే 5: మండలంలోని కల్లేపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని పబ్బతి అపరంజి ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దారం లక్ష్మీతిరుపతిరెడ్డి కుమారుడు అశోక్‌రెడ్డి ఆమెకు రూ.10వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.

సనాతన ధర్మం జీవన విధానంలో భాగం కావాలి

● జనజాగరణమంచ్ తెలంగాణప్రాంత బాధ్యుడు నల్లా చక్రవర్తుల రామకృష్ణ


మాట్లాడుతున్న నల్లా చక్రవర్తుల రామకృష్ణ

జహీరాబాద్, మే 5: సనాతన ధర్మం జీవన విధానంలో భాగస్వామ్యం కావాలని జనజాగరణమంచ్ తెలంగాణ ప్రాంత బాధ్యులు నల్లా చక్రవర్తుల రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాంమందిర్‌లో బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో సనాతనధర్మం-మనకర్తవ్యం అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మం విషయంలో అపోహలు ఏర్పరిచే విధంగా పలువురు రాజకీయ వివాదాలు సృష్టిస్తూ మతాల మధ్యన చిచ్చుపెడుతున్నారన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే దైవభక్తి, సంస్కారం, క్రమశిక్షణ, గౌరవమర్యాదలు ఉండేలా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో బ్రాహ్మణసేవాసమాజ్, బ్రాహ్మణసంఘం నాయకులు శంకర్‌రావుకులకర్ణి, రాజ్‌కుమార్‌దేశ్‌పాండే, సురేష్‌కులకర్ణి, బాబురావుజోషి, పుణీత్‌జోషి, సురేష్‌జోషి, ప్రభావతి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

● హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి



హుస్నాబాద్‌లో 5కే రన్ నిర్వహిస్తున్న దృశ్యం

హుస్నాబాద్/దుబ్బాక, మే 5: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి కోరారు. ఓటరు అవగాహన కోసం స్వీప్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం 5కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఇందులో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ రుక్మిణి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఆదివారం దుబ్బాకలో తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, మండల విద్యాధికారి ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఆదివారం 5కే రన్ నిర్వహించారు. దుబ్బాక పట్టణంలోని వివిధ శాఖల ఉద్యోగులు, విద్యార్థులు ఈ రన్‌లో పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని వారు పేర్కొన్నారు. అనంతరం ఓటు వినియోగం గురించి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్, తదితరులున్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం


పొన్నాలలో మోరీలో పేరుకుపోయిన చెత్త

సిద్దిపేట అర్బన్, మే 5: గ్రామాల్లో సర్పంచులు పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో గ్రామాలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. సిద్దిపేట అర్బన్ మండలంలో 12 గ్రామాలు ఉండగా, రెండు గ్రామాలకు ఒకరిని చొప్పున మండల అధికారులను ప్రత్యేకపాలన అధికారులుగా నియమించారు. ప్రత్యేకపాలన అధికారులను నియమించి సుమారు రెండుమూడు నెలల కావస్తున్నా, ఇప్పటివరకు అధికారులు గ్రామాలలో పర్యటించి పరిస్థితులు తెలుసుకున్న దాఖలాలు లేవని ఆయా గ్రామ ప్రజల నుంచి విమర్శలు వినబడుతున్నాయి. గ్రామంలో మంచినీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా తదితర సమస్యలు వస్తే గతంలో గ్రామ సర్పంచ్‌కు చెప్పుకునే వాళ్లమని, ఇప్పుడు ప్రత్యేక అధికారులను నియమించినా వారు అందుబాటులో లేక సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉన్నప్పటికీ, గ్రామాల్లో ఏదైనాపని విషయమై అడిగినా, పై అధికారుల సూచనల మేరకే పనులు ఉంటాయని చెప్పడంతో గ్రామస్థులు ఉసురుమంటున్నారు. కొన్ని గ్రామాల్లో రెండుమూడు నెలలుగా మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇదేమిటని స్థానిక పంచాయతీ కార్యదర్శులను ప్రశ్నిస్తే గ్రామపంచాయతీలో ఉన్న పారిశుధ్య కార్మికులను ఇతర పనులకు ఉపయోగించాల్సిందిగా ఉన్నతాధికారులు జారీ చేస్తున్నారని చెబుతున్నారని వాపోతున్నారు. ప్రత్యేక అధికారులు వచ్చిన కొత్తలో ఒక గ్రామ సభ నిర్వహించారంతే. స్థానికంగా ప్రత్యేక అధికారులు అందుబాటులో ఉండకపోవడం, కనీసం వారంలో రెండురోజులైనా గ్రామాన్ని సందర్శించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.